క్లుప్తంగా

రేపు వలంటీర్లకు సత్కారం

ఆత్మకూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా ఇళ్ల వద్దకే అందజేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా సేవా దృక్పథంతో పనిచేస్తున్న వార్డు వలంటీర్లను వివిధ పతకాలతో సత్కరించే కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా శనివారం తెలిపారు. స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో ఉదయం 10 గంటల ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి వలంటీర్లను సత్కరిస్తారన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వలంటీర్లు అందరికీ సేవలకు ప్రామాణికంగా నగదు బహుమతులు, పతకాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

200 మంది సేవా మిత్రులు

సోమశిల: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండి సంక్షేమ పథకాల సేవలు అందిస్తున్న వలంటీర్లలో మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 200 మంది సేవా మిత్రలుగా ఎంపికయ్యారు. వీరితో పాటు ఇద్దరు సేవా వజ్ర, ఐదుగురు సేవా రత్నకు ఎంపికైనట్లు ఎంపీడీఓ తాజ్ మస్రూర్ శనివారం తెలిపారు.

నేడు విక్రమ్‌రెడ్డి విజయీభవయాత్ర

అనుమసముద్రంపేట: మండలంలోని అక్బరాబాద్, గుంపర్లపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం విజయీభవ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు అక్బరాబాద్, సాయంత్రం 5.30 గంటలకు గుంపర్లపాడులో కార్యక్రమాన్ని కొనసాగిస్తారన్నారు. ఇదే సమయంలో ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలిపారు.

రేపు 'టెక్ ఫెయిర్'

ఆత్మకూరు: సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్ ఏర్పచుకోవచ్చునని, పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ సరైన మార్గమని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం 'టెక్ ఫెయిర్' జరగనుందన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణం, మండలంలోని అన్ని పాఠశాలల 8, 9, 10 తరగతుల విద్యార్థినీ, విద్యార్థులకు టెక్ ఫెయిర్ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. సాంకేతిక విద్యతో కలిగే ప్రయోజనాలు, ఉద్యోగావకాశాలపై విద్యావేత్తలు తెలియజేస్తారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, వారికి కేటాయించిన సమయాల్లో అవగాహన సమావేశానికి హాజరయ్యేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు సమాచారం ఇచ్చినట్లు ప్రిన్సిపల్ వివరించారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో ఇటీవల మృతి చెందిన ఐదుగురి కుటుంబాలకు పట్టణానికి చెందిన శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి శనివారం ఆర్థిక సాయం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 20, 21, 23, 7వ వార్డులకు చెందిన కావాటి తిరుపతమ్మ, ముట్లూరి రంగమ్మ, ఇమామ్‌హుస్సేన్, దండే కొండమ్మ, షరీఫ్ అనారోగ్యం, వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆయా కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కామాక్షయ్యనాయుడు, సూరా భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, జమీర్, ట్రస్ట్ సభ్యులు అశోక్‌రెడ్డి, కేవీ శేషారెడ్డి, కంది చంద్రారెడ్డి, మెప్మా ఆర్పీలు సుష్మ, జబీనా, మహబూబ్ జానీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సులభ రీతిలో బోధన

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సులభ రీతిలో పాఠ్యాంశాల బోధన చేయాలని ఎంఈఓ తోట శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం మండలంలోని గుడినరవ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఎంఈఓ విద్యార్థుల ప్రగతిని సబ్జెక్ట్‌ల వారీగా పరీక్షించారు. గణితంలో ప్రతిభ చూపడంతో విద్యార్థులను అభినందించారు. చతుర్విధ ప్రక్రియల ద్వారా గణితం బోధించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకునేలా చూడాలన్నారు. అనంతరం రాగి జావ, మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రతకు అందించిన రసాయనాలను ఉపయోగిస్తుండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆల్‌ఫ్రెడ్ పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

దుత్తలూరు: మండలంలోని నందిపాడులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుకాణంపై శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించినట్లు ఎస్సై ఉమాశంకర్ శనివారం తెలిపారు. 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడు బత్తుల వెంగయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేదల కోసం పెత్తందారులతో పోరాటం



రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- జగనన్నకు అండగా నిలబడుదాం
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి
- రూ.2.75 కోట్లతో బీటీ, సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం వ్యవస్థీకృత పెత్తందారులు, దోపిడీదారులతో పోరాడుతున్నారని, ప్రజల భవిష్యత్‌ను, రాష్ట్రాభివృద్ధిని కాంక్షిస్తూ రానున్న ఎన్నికల్లో అందరూ జగనన్నకు అండగా నిలబడాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. పెద్దపవని రోడ్డు– సిరిపురం–చలంచర్ల వరకు రూ.2.75 కోట్లతో బీటీ, సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శనివారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పరిపాలనను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయన్నారు. దీన్ని బట్టి జగనన్న పాలన యావత్ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పేదల కుటుంబాలు వృద్ధి చెందాలంటే వారి పిల్లలకు నాణ్యమైన చదువు అందించడం ద్వారానే సాధ్యమవుతుందని భావించి విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపట్టి, ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నారన్నారు. ఒక మాటలో చెప్పాలంటే విదేశీ స్థాయి సామర్థ్యత ఉన్న చదువులను గ్రామీణ స్థాయి నుంచి అమలు చేస్తున్నారన్నారు. పాదయాత్రలో ప్రజల కష్ట సుఖాలు తెలుసుకుని సీఎం అయిన తర్వాత వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలు ఇంటి గుమ్మాల వద్దకే చేర్చారన్నారు. ఏ కుటుంబం ఏ పథకానికి అర్హులో గుర్తించి వారికి ఆ పథకం అందించేటప్పుడు వారి ముఖాల్లో ఆనందం, పెదాలపై చిరునవ్వు చూసినప్పుడు ఎంతో ఆనందంగా అనిపిస్తోందన్నారు. ప్రతి నెలా పింఛన్ ఇచ్చేటప్పుడు అవ్వాతాతలు మా పెద్ద కొడుకుకు (జగనన్నకు) మా దీవెనలు ఉంటాయని చెబుతున్నారంటే జగనన్న సుపరిపాలన ఎలా ఉందో అద్దం పడుతోందన్నారు.

చంద్రబాబు పథకం ఒక్కటైనా ఉందా?

14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు అమలు చేసి ప్రజాదరణ పొందిన పథకం ఒక్కటైనా ఉందా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రాష్ట్రానికే కాదు, ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. చంద్రబాబు, టీడీపీ నేతలు నిత్యం దూషణలు, తిట్లు, శాపనార్థాలు, బెదిరింపులకు పాల్పడున్నారన్నారు. ప్రజలను భయాందోళనకు గురిచేసి అధికారంలోకి రావాలని కుట్రలు పన్నుతున్నారన్నారు. చంద్రబాబు హైదరాబాద్ నుంచి అర్ధరాత్రి పారిపోయి రావడం వల్లే రాష్ట్రానికి రాజధాని లేని దుస్థితి నెలకొందని, చంద్రబాబు పాపాల వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఎమ్మెల్యే మండిపడ్డారు. ప్రభుత్వంపై చౌకబారు వ్యాఖ్యలు చేయడం, ఏడవడం తప్ప ప్రతిపక్షాలకు వేరే పని లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సీఎం వైఎస్ జగన్ ఒకటే చెబుతున్నారని, మేము మంచి చేశాం అనుకుంటేనే మళ్లీ మాకు అవకాశం ఇవ్వండి అంటున్నారని చెప్పారు. సుదీర్ఘకాలం రాజకీయ అనుభవం, 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకుంటున్న చంద్రబాబుకు ఈ రోజు ప్రజల ముందుకొచ్చి ఇలా అడిగే దమ్ము ఉందాని ప్రశ్నించారు. తన హయాంలో చేసిందేమీ లేక.. చెప్పుకోలేక, తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ తనను అధికారంలోకి తెస్తే ఏదేదో చేస్తానని అరచేతిలో వైకుంఠం చూపించే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు.

నూతన రోడ్డు ప్రత్యేకత

సిరిపురం, చలంచర్ల పంచాయతీల పరిధిలోని గ్రామాల ప్రజలకు రోడ్డు వసతి లేక ఎన్నో ఏళ్లుగా అవస్థలు పడుతుంటే రూ.2.75 కోట్ల నిధులతో శాశ్వతంగా పటిష్టంగా ఉండే విధంగా రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. కావలి–పెద్దపవని రోడ్డు నుంచి సిరిపురం క్రాస్ రోడ్డు నుంచి 1.8 కి.మీ. సిమెంట్ రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ మార్గంలో చెరువు ఉండడంతో ఊట నీరు రోడ్లను ధ్వంసం చేస్తుందని, సిమెంట్ రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. అక్కడ నుంచి 6.2 కి.మీ. మేర చలంచర్ల వరకు తారు రోడ్డును నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, ఎంపీపీ కొండమ్మ సర్పంచ్‌లు రమేష్, నాయకులు నాయుడు రాంప్రసాద్, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

మహిళల పక్షపాతి ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- వైఎస్సార్ ఆసరా విజయోత్సవ సంబరాలు



వెలుగు, వీఓఏలు, మెప్మా ఆర్పీలకు వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: గత ప్రభుత్వాలకు భిన్నంగా రాష్ట్రంలోని ప్రతి మహిళను ఆర్థికంగా శ్రీమంతులను చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా, తోడుగా ఉండి, ఇంటి స్థలాలు, ఇల్లు ఇచ్చి మహిళా పక్షపాతి ప్రభుత్వంగా నిలిచిందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. అందుకే ప్రతి మహిళ పార్టీలకు అతీతంగా జగనన్న అంటే ప్రేమ, అభిమానం చూపుతున్నారన్నారు. ఇటీవల నియోజకవర్గంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా విజయవంతం కావడంతో సంబంధిత వైఎస్సార్ వెలుగు, వీఓఏలు, మెప్మా ఆర్పీలు, తదితర సిబ్బందితో ఆయన మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం వెలుగు, మెప్మా సిబ్బంది సహకారంతోనే అర్హత ఉన్న ప్రతి మహిళకు ఆసరా ప్రతి ఏటా అందిందన్నారు. పొదుపు మహిళలు చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకుంటూ ఆర్థికంగా మెరుగుపడ్డారన్నారు. వీఓఏలు, మెప్మా ఆర్పీల సేవలు భవిష్యత్‌లోనూ ఇలాగే కొనసాగాలని, ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా పని చేస్తున్న వారి మేలు మరువలేనిదన్నారు. గతంలో టీడీపీ పాలనలో పొదుపు సంఘాల సభ్యులకు ఇచ్చిన మాట మేరకు రుణమాఫీ చేయకపోగా వారు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు జరిగాయన్నారు. చంద్రబాబు మాటలు నమ్మి బ్యాంకుల్లో బంగారు తెచ్చుకోలేక, వేలంలో కోల్పోయిన సందర్భాలు ఉన్నాయన్నారు. జగనన్న ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతల్లో పొదుపు రుణాలు మాఫీ చేశారన్నారు. ఇది అమలవ్వడానికి సిబ్బందే బాధ్యత వహించారని, వారికి ప్రభుత్వం రుణపడి ఉంటుందన్నారు. తన సొంత నిధులతో నియోజకవర్గంలోని అన్ని మండలాల పొదుపు వీఓఏలు, మెప్మా ఆర్పీలకు రెండు చీరలు (యూనిఫాం) అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు కేతా వేణుగోపాల్ రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, పెయ్యల సంపూర్ణమ్మ, పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్ రెడ్డి, మైనార్టీ నాయకురాలు పర్వీన్, జెడ్పీటీసీలు లక్ష్మీప్రసన్న, పీర్ల పార్థసారథి, పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, మెప్మా అధికారులు అంకయ్య, మాధవి, ఏపీఎంలు వెంకమ్మ, సుజన, బుజ్జమ్మ, పార్టీ నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, మర్రిపాడు మాజీ కన్వీనర్ జి శ్రీనివాసులు నాయుడు, సంగం నాయకులు రఘునాథ్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత



జనంతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న రాజగోపాల్‌రెడ్డి



ప్రచార రథం నుంచి మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి
- విజయ సంకల్ప యాత్రకు అనూహ్య స్పందన

కలిగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల అభివృద్ధి, సంక్షేమంతో పాటు విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. శనివారం మండలంలోని కుమ్మరకొండూరు, పరికోట పంచాయతీల్లో విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. రాజగోపాల్‌రెడ్డికి కుమ్మరకొండూరులో మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. కుమ్మరకొండూరు అభయాంజనేయ స్వామి, కోదండరామస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కుల, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో అభివృద్ధికి పునాది వేసిందే మేకపాటి కుటుంబమన్నారు. కరోనా విపత్కర పరిస్థితిలో కూడా సీఎం జగన్ ఎటువంటి ప్రాణహాని జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షలు వైద్య సాయం అందజేస్తూ ముఖ్యమంత్రి ప్రాణదాతగా నిలిచాడన్నారు. గ్రామాల్లో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు ద్వారా ముఖ్యమంత్రి గ్రామ స్వరాజ్యానికి సరైన భాష్యం చేప్పాడన్నారు. పనులు చేసే ప్రభుత్వం, పేదవారి కష్టాలు తీర్చేది జగన్ ప్రభుత్వమన్నారు. తాను నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, జగనన్నను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి బొల్లినేని వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ దేవిరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, సర్పంచ్ నోటి మల్లికార్జునరెడ్డి, స్థానిక నాయకులు నోటి జనార్ధన్‌రెడ్డి, షడ్డా రమణారెడ్డి, దువ్విరెడ్డి శ్రీనివాసులరెడ్డి, షడ్డా చంద్రశేఖర్‌రెడ్డి, పర్వతరెడ్డి బాలకృష్ణారెడ్డి, కోటంరెడ్డి సుజాతమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్‌ఓ రాజారమేష్

ఉదయగిరి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈవీఎం మొబైల్ వాహనం ఏర్పాటు చేయడంతో పాటు నోడల్, సహాయ నోడల్ అధికారులుగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలకేశవులు, ఏపీఎం ఖాజా రంతుల్లాను నియమించామన్నారు.

నేడు సెక్టారు అధికారులకు శిక్షణ

ఉదయగిరి నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు నియమించిన సెక్టారు అధికారులకు పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ఆది, సోమవారాల్లో శిక్షణ తరగతులు జరుగుతాయని ఆర్‌ఓ రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఏఆర్వో నెహ్రూబాబు పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీకి జరిమానా



లారీని తనిఖీ చేస్తున్న సెబ్ అధికారులు

దుత్తలూరు: అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీకి రూ. 30 వేలు జరిమానా విధించినట్లు ఉదయగిరి సెబ్ సీఐ ఆర్‌వీ రమణమ్మ తెలిపారు. శనివారం దుత్తలూరులోని 565వ జాతీయ రహదారిపై సెబ్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. సంగం నుంచి దర్శికి ఇసుక తరలిస్తున్న లారీ నిర్దిత బరువు కంటే 15 టన్నులు అధికంగా తీసుకెళ్తున్నట్లు గుర్తించి జరిమానా విధించామన్నారు. ఈ తనిఖీల్లో సెబ్ ఎస్సై మురళీకృష్ణ, సిబ్బంది జయ చంద్రయ్య, తిరుపతయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన



వాహనదారులకు సూచనలు చేస్తున్న ఎస్సై నాగార్జునరెడ్డి

సంగం: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సంగం చెక్‌పోస్ట్ సెంటర్ వద్ద ఎస్సై నాగార్జునరెడ్డి శనివారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని తెలిపారు.

ఏపీ జేఏసీ ఆందోళన

ఆత్మకూరురూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ ఆత్మకూరు తాలుకా యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. ఆత్మకూరు యూనిట్ ఏపీ జేఏసీ చైర్మన్ శైలజ, ప్రధాన కార్యదర్శి చంద్రోశేఖర్ మాట్లాడారు. జేఏసీ నాయకులు సుధాకర్, సుప్రియ, గురుప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొన్న ఆత్మకూరు క్రీడాకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్రంలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలు గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించిందని ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో గెలుపొంది రాష్ట్రస్థాయిలో క్రీడల్లో పాల్గొన్న ఆత్మకూరుకు చెందిన కె. అశోక్, కార్తికేయలను ఎమ్మెల్యే అభినందించి సత్కరించారు. శనివారం పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉద్యోగాల్లోనూ ప్రత్యేక కేటగిరీ ఉంటుందని తెలిపారు. ఆత్మకూరుకు చెందిన ఈ ఇద్దరు క్రీడాకారులు మిగిలిన యువతకు రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రోత్సాహక నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు, షీల్డ్‌లు అందజేశారు.

సీఎం సహాయనిధి అందజేత

అనారోగ్య కారణాలతో ఆరోగ్య శ్రీకార్డులు వర్తించక సొంత డబ్బులతో వైద్యం చేయించుకున్న మర్రిపాడు మండలానికి చెందిన కె వెంకట రమణయ్యకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి రూ.1.10 లక్షలు మంజూరైంది. రమణయ్యకు సీఎం సహాయనిధి చెక్కును శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలతో పాటు పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, మర్రిపాడు నాయకులు మోహన్ రెడ్డి, గంగవరపు శ్రీనివాసులు నాయుడు, ఆత్మకూరు నాయకులు ఐవీ రమణారెడ్డి, బొమ్మిరెడ్డి రవి కుమార్‌రెడ్డి, గడ్డం శ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్ కామాక్షయ్య నాయుడు, కొండా వెంకటేశ్వర్లు, జమీర్, కలాం, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జగన్ ప్రభుత్వంలోనే మేలు



మాట్లాడుతున్న కన్వీనర్, ఎస్సీ నాయకులు

కొండాపురం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఎంతో మేలు జరిగిందని మండల అధ్యక్షుడు చిమ్మిలి రవీంద్ర, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులరెడ్డి, ఎస్సీ నాయకులు ఏలేషా, పరుసు మాల్యాద్రి అన్నారు. శనివారం కొండాపురంలో ఎనిమిది మండలాల బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 23న కొండాపురంలో నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్‌సీపీ బహుజన సమర భేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, బాపట్ల ఎంపీ నందిగామ సురేష్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, జూపూడి ప్రభాకర్ ఈ సమరభేరికి హాజరవుతారన్నారు. రిజర్వేషన్లు కల్పించడంలో వైఎస్సార్‌సీపీ పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రథమ స్థానం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్, వైస్ ఎంపీపీ బంకా మాల్యాద్రి, గడవళ్లూరు ఎంపీటీసీ అంకయ్య, దాసరి వెంకటేశ్వర్లు, టి. కమలాకర్, కొండాపురం మండల ఎస్సీ సెల్ కన్వీనర్ దావులూరి మాల్యాద్రి, ఎస్సీ నాయకులు మంచాల శంకర్, ప్రసాద్, దారం వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రజల పక్షం- ప్రతిపక్షాలు పెత్తందారుల పక్షం

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- అభివృద్ధి పనులు ప్రారంభం
- రేవూరు, శంకరనగరంలో విజయీభవ యాత్ర



విజయీభవయాత్రలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సోమశిల: ప్రతి ఒక్కరి అభివృద్ధిని కాంక్షించే జగనన్న ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వమని, ప్రతిపక్ష పార్టీలు పెత్తందారుల వైపు నిలుచున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం అనంతసాగరం మండలం శంకరనగరం, రేవూరు గ్రామాల్లో విజయీభవయాత్రను నిర్వహించారు. ఎమ్మెల్యే మేకపాటికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. తొలుత దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం విజయీభవయాత్రలో ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అవ్వాతాతలతో మాట్లాడుతూ పింఛను నగదు అందుకుంటున్నారా? వలంటీర్ల ఎలా పని చేస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లుగా ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించిందన్నారు. అభివృద్ధిని చేసిందన్నారు. రాబోయే ఐదేళ్లలో ప్రజలకు తాము చేయదల్చుకున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు తెలియజేశారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి వివరించారు. ఆత్మకూరు నియోజక వర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలో రైతాంగానికి మేలు కలిగే విధంగా ఐదు వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా పరిశ్రమను నెలకొల్పి బయట ప్రాంతాలకు మన యువత వెళ్లకుండా ఇక్కడే ఉద్యోగాలు చేసుకునేలా చేస్తామన్నారు. ఇస్కపల్లి పంచాయతీలో రూ.6.59 కోట్లు, రేవూరు పంచాయతీలో రూ.13.37 కోట్లు సంక్షేమాభివృద్ధికి ఖర్చు చేసినట్లు వివరించారు. జగనన్న రెవెన్యూ వ్యవస్థలో తెచ్చిన సంస్కరణలతో ఇస్కపల్లి పంచాయతీలో 139 మంది రైతులకు, రేవూరులో 207 మంది రైతులకు మేలు చేకూరిందన్నారు. ఈ సందర్భంగా సచివాలయం, రైతు భరోసా కేంద్రాలతో పాటు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు పెయ్యల సంపూర్ణమ్మ, కేతా వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాణెం శ్రీనివాసులు, సర్పంచ్‌లు పార్లపల్లి వరలక్ష్మి, ఆత్మకూరు బుజ్జమ్మ, ఎంపీటీసీ పాలపాటి చిన నాగిరెడ్డి, పాలపాటి నాగార్జునరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కేతా రామకృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అక్కులరెడ్డి అంకిరెడ్డి, కొండయ్య, రమణయ్య, కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ స్టాల్స్ పరిశీలన



ఆత్మకూరులో చికెన్ స్టాల్స్ నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్

ఆత్మకూరు: జిల్లాలో పలు ప్రాంతాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాపించిన నేపథ్యంలో ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు చికెన్ స్టాళ్లను మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా శనివారం పరిశీలించారు. నాలుగు రోజులుగా పొదలకూరు మండలంలోని పలు ప్రాంతాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకి మృతి చెందుతున్న విషయం తెలిసిందే. బయట ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా ఆత్మకూరులోని చికెన్ విక్రయించే స్టాళ్లకు కోళ్ల సరఫరా అవుతుంటాయి. ఈ విషయం తెలుసుకున్న కమిషనర్ ఆయా దుకాణదారులతో మాట్లాడారు. వినియోగదారులకు పరిశుభ్రమైన చికెన్ అందజేయాలని కోరారు. వైరస్ నేపథ్యంలో ప్రజలు సైతం కొద్ది రోజుల పాటు చికెన్ వాడకాన్ని తగ్గించాలన్నారు. చికెన్ విక్రయించే స్టాల్స్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ ప్రసాద్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతీ దేవి పూజ



అల్లూరు: మండలంలోని నార్త్‌మోపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతీదేవి పూజ నిర్వహించారు. త్వరలో జరగనున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హెడ్‌మాస్టర్ రూప తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.